క్లుప్తంగా

నేదురుమల్లితో ఆదిమూలపు భేటీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించి పలు అంశాలపై మాట్లాడారు.

సామూహిక కుంకుమార్చన రేపు

ఇందుకూరుపేట: వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు అనిల్‌స్వామి బుధవారం తెలిపారు. తొలుత అమ్మవారికి విశేష పూజలు జరుపనున్నట్లు చెప్పారు.

కాంట్రాక్టర్లతో ఇళ్ల నిర్మాణాల పూర్తి

పొదలకూరు: గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ల ద్వారానే పనులను పూర్తి చేయించేలా చూస్తున్నామని ఎంపీడీఓ నరసింహరావు పేర్కొన్నారు. కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్లపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ ఏఈ మహేష్‌తో కలిసి బుధవారం ఆయన సమీక్షించారు. అనంతరం ఎంపీడీఓతో సంబంధిత కాంట్రాక్టర్లు మాట్లాడారు. పట్టణానికి చెందిన లబ్ధిదారులకు చిట్టేపల్లి తిప్ప వద్ద 1400 ప్లాట్లను పంపిణీ చేశారని, ఇందులో 250 ఇళ్లకు బేస్‌మెంట్లను నిర్మించగా, మిగిలిన వాటికి స్లాబులను పూర్తి చేశామని తెలిపారు. ప్రభుత్వ లేఅవుట్‌పై విజిలెన్స్ విచారణ జరుగుతున్న నేపథ్యంలో ముందుగా దాని పరిస్థితిని పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదించనున్నామని వెల్లడించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: గేదెను తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని ఇస్కపాళెం సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. నిడిగుంటపాళెం నుంచి సర్వేపల్లి వైపు బైక్‌పై రవికిరణ్ బయల్దేరారు. ఈ క్రమంలో ఇస్కపాళెం సమీపంలో గేదె అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పింది. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడ్ని నెల్లూరు తరలించారు.

రేపట్నుంచి గంగమ్మ తల్లి కొలుపు

పొదలకూరు: పట్టణంలోని శివాలయ వీధిలో కొలువైన గంగమ్మతల్లి దేవస్థానంలో కొలుపు మహోత్సవాన్ని శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ పేర్కొంది. విశేష పూజా కార్యక్రమాలను జరపనున్నామని, భక్తులు తరలిరావాలని కోరారు.

కుక్కను దారుణంగా చంపారు

- ఫిర్యాదు చేసిన బాధితులు




విడవలూరు: కోడిపిల్లను కరిచిందనే నెపంతో కుక్కను దారుణంగా పొడిచి చంపాడని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితులు బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని వావిళ్ల గ్రామం దళితవాడకు చెందిన పాటూరు కాటయ్య–ఆదిలక్ష్మమ్మ దంపతులు నాలుగేళ్ల నుంచి వారి ఇంట్లో ఓ కుక్కను పెంచుకుంటున్నారు. బుధవారం సొంత పనుల నిమిత్తం ఆదిలక్ష్మమ్మ తన భర్తతో కలిసి నెల్లూరుకు వెళ్తూ కుక్క బాధ్యతలను ఇంటి దగ్గర ఉన్న ఆమె అత్త సీతారామమ్మకు అప్పగించింది. ఈ క్రమంలో పక్కింట్లో ఉంటున్న మడపర్తి సుధాకర్ అనే వ్యక్తి తమ ఇంటికి వచ్చి ఇంట్లో కట్టేసి ఉన్న కుక్కను ఇనుప గునపంతో పొడవగా కుక్క అక్కడికక్కడే మృతి చెందింది. ఎందుకు పొడిచావంటూ సీతారామమ్మ ప్రశ్నించగా తన ఇంట్లో ఉన్న కోడి పిల్లలను తినేసిందంటూ సమాధానం ఇచ్చాడు. అంతలో నెల్లూరు నుంచి వచ్చిన ఆదిలక్ష్మమ్మ తాను ఎంతో ఇష్టంగా పెంచుకుంటున్న కుక్క చనిపోయి ఉండడం చేసి కన్నీరు పెట్టుకుంటూ, చనిపోయిన కుక్కను తీసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై నరేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ప్రమాదభరితంగా వాటర్‌ట్యాంక్



విరిగిపోయిన ట్యాంక్ మెట్లు



కోతుల ఆవాసంగా మారిన ట్యాంక్ పైభాగం



శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్

- మూడేళ్ల నుంచి క్లీనింగ్‌కు నోచుకోని వైనం
- విద్యార్థులపై పడుతున్న సిమెంట్ పెచ్చులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 30 ఏళ్ల క్రితం పాఠశాల ఆవరణలో నిర్మించిన తాగునీటి వాటర్‌ట్యాంక్ ప్రస్తుతం ప్రమాదభరితంగా మారింది. కూలిపోయే స్థితికి రావడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. నగరంలోని 53వ డివిజన్ పునరావాస కాలనీలో నిర్మించిన వాటర్ ట్యాంకు ద్వారా 53, 54 డివిజన్లకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో తాగునీరు సరఫరా అవుతోంది. ఈ ట్యాంక్ నిర్మించిన ఆవరణలోనే మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో 200 మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే ఈ వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకోవడంతో ట్యాంకు మెట్లు పూర్తిగా విరిగిపోయాయి. దీంతో ట్యాంకు పైకి ఎక్కే వీలు లేకపోవడంతో గత మూడు సంవత్సరాల నుంచి సిబ్బంది వాటర్ ట్యాంకును శుభ్రం చేయడం లేదు. ఈ ట్యాంకుపై భాగాన కోతులు నివాసం ఉండడంతో ప్రమాదవశాత్తు ట్యాంకులో పడి మృతిచెందినా తెలియని పరిస్థితి నెలకొంది. వాటర్ ట్యాంకు సిమెంట్ పెచ్చులు ఊడి ఇనుప కమ్ములు దర్శనమిస్తున్నాయి. వాటర్ ట్యాంక్ ఉన్న ఆవరణలోనే పాఠశాల ఉండడంతో సిమెంట్ పెచ్చులు విద్యార్థులపై



ఊడిపోయిన ట్యాంక్ సిమెంట్ పెచ్చులు

పడుతున్నాయి. ఈ క్రమంలో ప్రమాదభరితంగా ఉన్న వాటర్ ట్యాంకును పూర్తిగా తొలగించి కొత్త నిర్మాణం చేయాల్సి ఉంది.

కాకాణి పూజితకు అభినందనల వెల్లువ



కాకాణి పూజితను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజితకు జిల్లా నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి అభినందనలు తెలియజేస్తున్నారు. నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం పలు మండలాల నాయకులు ఆమెను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కాకాణి పూజిత మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మా నాన్న గోవర్ధన్‌రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తనకు అభినందనలు తెలియజేయడానికి విచ్చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంహెచ్‌ఓ కనకాద్రి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని వ్యాపారాలకు ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి అని, సచివాలయాల వారీగా సంబంధిత శానిటేషన్ కార్యదర్శులు నూతన వ్యాపారాలను గుర్తించి ట్రేడ్ లైసెన్సులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి ఆదేశించారు. పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో వారాంతపు సమీక్ష సమావేశాన్ని ఎన్ఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియను క్రమం తప్పకుండా చేపడుతూ, 24 గంటల్లోపు డంపింగ్ యార్డులకు తరలించేలా పర్యవేక్షించాలని తెలిపారు. తప్పనిసరిగా తడి, పొడి చెత్తను విడిగా సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని డివిజన్లలో క్రమం తప్పకుండా కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో నెల్లూరు నగరపాలక ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, మలేరియా విభాగం అధికారి జిజియా బాయి, వెటర్నరీ డాక్టర్ మదన్ మోహన్, శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో త్రయోదశి



మూలస్థానేశ్వరులకు వెండినంది ఉత్సవం



మీనాక్షి సుందరేశ్వరస్వామి సన్నిధిలో..

నెల్లూరు(బృందావనం): శ్రావణమాస త్రయోదశిని నగరంలోని పార్వతీ పరమేశ్వరుల నిలయాల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ రూపాల్లో కొలువైన ఆదిదంపతులు, నందీశ్వరులకు ప్రదోషకాల పూజలు, అర్చనలు చేశారు. మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో రాత్రి స్వామివార్లకు చిన్న వెండినంది ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

⇨ కరెంటాఫీస్ సెంటర్‌లోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో మీనాక్షి సమేత సుందరేశ్వరస్వామికి ప్రదోషకాల పూజ, అభిషేకాలు విశేషంగా నిర్వహించారు. దేవస్థానం ఈఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి పాల్గొని పర్యవేక్షించారు.

ఎన్‌హెచ్‌ఆర్సీ రాష్ట్ర ఇన్‌చార్జిగా పద్మాకర్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఏపీ రాష్ట్ర ఇన్‌చార్జిగా బుచ్చిరెడ్డిపాళెం పట్టణానికి చెందిన ఊదూరు పద్మాకర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెంలో వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకుడు పెద్ద అల్లాభక్షు బుధవారం ఆయన్ను అభినందించి, మాట్లాడారు. పద్మాకర్ మరెన్నో పదవులు పొంది సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

యజ్ఞోపవీతధారణకు ఆహ్వానం

నెల్లూరు(బృందావనం): శ్రావణపూర్ణిమ సందర్భంగా శనివారం నూతన యజ్ఞోపవీతధారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తిక్కన మహాకవి లలిత కళాపీఠం అధ్యక్షుడు, వేదపండితుడు ఆలూరు శిరోమణిశర్మ బుధవారం తెలిపారు. స్టోన్‌హౌస్‌పేట రేబాలవారివీధిలోని గాజులపల్లి పిచ్చమ్మ ధార్మిక సదనంలో ఉదయం 7.30 గంటలకు జరిగే కార్యక్రమంలో యజ్ఞోపవీతధారణకు విచ్చేసే వారికి మడిపట్టు వస్త్రాలు, గృహస్తులకు ధోవతి, ఉత్తరీయం, బ్రహ్మచారులకు నాలుగు మూరల పంచ తదితరాలను అందజేయనున్నామన్నారు. పూర్తి వివరాల కోసం 98856 61727 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఆ శాఖ టౌన్ ఈఈ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

⇨ ఆటోనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీ, జ్యోతి నగర్, రైల్వేగేట్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అలాగే రామ్మూర్తినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటరామాపురం, జేమ్స్‌గార్డెన్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయాలు ఉంటాయి.

⇨ పడారుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని సప్తగిరి కాలనీ, భారతీ లేఅవుట్, దండోరా కాలనీ, మారుతీ లేఅవుట్, పాండురంగ కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, పాత వేదాయపాళెం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అలాగే తెలుగుగంగ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని వెంగళరావునగర్, చాణుక్యపురి కాలనీ, ఆర్సీఆర్ నగర్, గాంధీ నగర్, మహిళా ప్రాంగణం, సుభాష్ చంద్రబోస్ నగర్, శాంతి నగర్, వీవర్స్‌కాలనీ, డైకస్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయాలు ఉంటాయి.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలివ్వాలి

నెల్లూరు (టౌన్): జిల్లాలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు మోహన్‌దాస్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బదిలీ ప్రక్రియ జరిగి నెలలు గడుస్తున్నా నేటికీ జీతాలు ఇవ్వలేదన్నారు. గత పీఆర్సీ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు కనీసం బిల్లులు కూడా సమర్పించలేదన్నారు. ఈనెలలో కార్యాలయాలకు అధిక సెలవులు ఉన్నాయని, దీనిని సాకుగా చూపి చెల్లింపులకు అడ్డంకులు కల్పించడం మానుకోవాలన్నారు.

అంగన్‌వాడీ సహాయకులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(పొగతోట): నెల్లూరు పరిధిలో అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ అరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూరల్ పరిధిలోని గుడిపల్లిపాడు-2, మేకలవారితోట, వావిలేటిపాడు ఎస్సీ, సౌత్ మోపూరు-3, సౌత్ మోపూరు బీసీ, ఎర్రకట్ట హెచ్‌డబ్ల్యూ, కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డ్ -1, అల్లీపురం-బీసీ, అల్లీపురం-2, అల్లీపురం-1-1, రామ్‌నగర్ -1, జనశక్తి నగర్, కొండాయపాళెం -1, నక్కలగుంట, నేతాజీనగర్-3, అంబేడ్కర్ నగర్-3, ఉయ్యాల కాలువకట్ట -1, ఇరగాళమ్మ సంఘం -1తో పాటు నెల్లూరు అర్బన్ పరిధిలో శ్రీనివాసపురం, ఇస్కడొంక, తడికల బజారు -1, కపాటిపాళెం-2, రాయపు హరిజనవాడ -1, సరస్వతి నగర్, ఎద్దెలరేవుసంగం -1 వంతున మొత్తం 25 అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హత కలిగిన వారు ఈనెల 26వ తేదీ సాయంత్రంలోపు నెల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): నగరంలోని అపోలో ఆస్పత్రి, మెడికవర్ ఆస్పత్రిలో ఉన్న స్కానింగ్ సెంటర్లను అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ, హెచ్ఈఈ నరసింహారావు బుధవారం తనిఖీలు చేశారు. అక్కడి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడుతూ స్కానింగ్ చేసిన ప్రతి గర్భిణి వివరాలను ఆస్పత్రుల యాజమాన్యాలు పీసీపీఎన్‌డీటీ యాక్ట్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం ఆయా ఆస్పత్రుల్లోని పల్మనాలజీ, గైనకాలజీ, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీలతో సమావేశమై టీబీ అనుమానిత కేసులను గుర్తిస్తే ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీబీ నివారణ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేపలు పట్టనీయకుండా దౌర్జన్యం చేస్తున్నారు



నెల్లూరు(అర్బన్): తమను చెరువులో చేపలు పట్టుకోనీయకుండా కొందరు దౌర్జన్యం చేస్తున్నారంటూ కలెక్టరేట్‌లో జేసీ కార్తీక్‌కు బుధవారం యానాదుల సంఘాల కూటమి ఆధ్వర్యంలో సాయిపేట గిరిజన మత్స్యకార సహకార సభ్యులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు జయంపు కనకయ్య మాట్లాడుతూ తాము 1989లో 127 మంది సభ్యులతో సాయిపేట పంచాయతీ గిరిజన మత్స్యకార సహకార సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నామన్నారు. అప్పటి నుంచి ఏటా సభ్యులంతా కలిసి ఉమ్మడిగా చేపలు పట్టుకుని జీవిస్తున్నామన్నారు. అయితే ఇప్పుడు తమ సంఘంలో సభ్యులైన పోలయ్య, ఎర్రబ్బాయి, మాల్యాద్రి, సుబ్రహ్మణ్యంలను అగ్రకులానికి చెందిన నలుగురు వ్యక్తులు రెచ్చగొట్టి విడిగా చేపలు పట్టుకునేలా ప్రోత్సహించారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా విడిగా చేపలు పట్టవద్దని చెప్పినందుకు అగ్రకులానికి చెందిన వారు, నలుగురు సభ్యులు కలిసి దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. అధికారులు విచారించి న్యాయం చేయాలని కోరారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా



నిర్మాణాలను తొలగిస్తున్న జేసీబీ

- జేమ్స్ గార్డెన్‌లో మూడు భవనాలు కూల్చివేత



వెంకటరామాపురం, జేమ్స్‌గార్డెన్‌లో నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాల తొలగింపు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై సంబంధిత అధికారులు కొరడా ఝుళిపించారు. ఇప్పటికే పలు అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టడం ప్రారంభించారు. నిబంధనలను ఉల్లంఘించి అదనపు అంతస్తులు నిర్మించిన స్థానిక వెంకటరామాపురం, జేమ్స్ గార్డెన్ ప్రాంతంలోని మూడు భవనాలను కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ విభాగ సిబ్బంది బుధవారం తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ నందన్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం నిర్దేశించిన అనుమతులు అతిక్రమించి చేపట్టిన నిర్మాణాలను తప్పనిసరిగా కూల్చివేస్తామని హెచ్చరించారు. అనధికార నిర్మాణాల తొలగింపునకు గతంలోనే నోటీసులు జారీ చేసి డెమోలిషన్ ఆర్డర్స్‌ను కూడా అందజేశామని తెలిపారు. యజమానులు కొంత గడువు కోరి స్వయంగా తొలగించుకుంటామని ప్రకటించి, ఆ సమయానికి కూడా పట్టించుకోకపోవడంతో టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో అదనపు అంతస్తుల నిర్మాణాలు తొలగించే ప్రక్రియను చేపట్టామన్నారు. పట్టణ ప్రణాళికా విభాగం మార్గదర్శకాలలో భవన నిర్మాణ యజమానుల సౌలభ్యం దృష్ట్యా అనేక సంస్కరణలు తీసుకొచ్చారని, వాటిని సద్వినియోగం చేసుకుని నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అనధికార కట్టడాలు, అక్రమంగా ఆక్రమించిన నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

వాస్క్యులర్ సమస్యలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): నేషనల్ వాస్క్యులర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడికవర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్తనాళాల ప్రసరణపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేసి వాస్క్యులర్ సమస్యల గురించి వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ గుండెపోటు, కిడ్నీ, ఊపిరితిత్తుల సమస్యల గురించి ప్రజల్లో కొంతమేరకు అవగాహన ఉందన్నారు. రక్తనాళాల్లో ప్రసరణ తగ్గితే వచ్చే ఇబ్బందులు కాళ్లు, వేళ్లు తీసేయాల్సి రావడం లాంటి అంశాలపై అవగాహన లేదన్నారు. అందువల్ల రక్తనాళాల్లో రక్త ప్రసరణ గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. మెడికవర్ ఆస్పత్రి హెడ్ సతీష్ మాట్లాడుతూ నగరంలో మొట్టమొదటి వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ సుదర్శన్‌రెడ్డి తమ ఆస్పత్రిలో సేవలందించడం అభినందనీయమన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా వైద్యసేవలు అందిస్తామన్నారు. ప్రజలు వినియోగించుకోవాలన్నారు. సర్జన్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ కాళ్లు, చేతిలో మంటలు పుట్టడం, పాదాలలో రక్తం గడ్డకట్టడం, వేళ్లు నల్లగా మారడం, మానని పుండ్లు లాంటి సమస్యలుంటే వాస్క్యులర్ సర్జన్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ విద్యార్థినులు, పీఆర్వో సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'గురుకులం' ప్రిన్సిపల్‌పై చర్యలు చేపట్టాలి



విద్యార్థినిని పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

నెల్లూరు(అర్బన్): కలుషిత ఆహారం తిని 30 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనలో తోటపల్లిగూడూరు మండలం కొత్తకోడూరు గ్రామంలోని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌పై కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతున్న పాఠశాలకు చెందిన ఇద్దరి విద్యార్థినులను బుధవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు విక్రమ్, సురేంద్ర, బీపీ నరసింహ, వంశీ పరామర్శించారు. హాస్టల్‌లో జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆహారం, తాగునీరు సక్రమంగా లేకపోవడంతో సోమవారం 30 మంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారన్నారు. అయితే ఆ విషయాన్ని దాచిపెట్టి మంగళవారం రాత్రి వరకు ఆస్పత్రికి తీసుకుని రాకపోవడం దారుణమన్నారు. నిర్లక్ష్యంతో వ్యవహరించడమే కాకుండా ప్రశ్నించిన విద్యార్థి సంఘం నాయకులను ఈవిషయాన్ని ఇంతటితో వదిలేయమని చెప్పడం తగదన్నారు. సంబంధిత ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని, కలుషితం లేని ఆహార పదార్థాలు అందించేలా చూడాలని, ఇందుకోసం తరచూ తనిఖీలు నిర్వహించాలని పేర్కొన్నారు.